సాక్షి
ఖమ్మం
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



ఒకేరోజు రెండు సమావేశాలు

దిశ కమిటీ సమావేశం, కేఎంసీ కౌన్సిల్ సమావేశం రెండూ ఈనెల 3వ తేదీనే ఏర్పాటు చేయడంతో గందరగోళం నెలకొంది. 8లో



ఈజీఎస్‌కు ఇక్కట్లే !

ఉపాధి హామీ పథకంలో సరిపడా సిబ్బంది లేక పర్యవేక్షణ, కూలీలకు పనులు కల్పించడంలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 20°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం పొగమంచు కమ్మే అవకాశముంది. ఆతర్వాత ఎండ పెరిగినా రాత్రి చలి వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎడమకాల్వకు 6వేల క్యూసెక్కుల నీరు

ఖమ్మంఅర్బన్: ఎట్టకేలకు నాగార్జునసాగర్ డ్యాం నుంచి ఎడమ కాల్వకు బుధవారం సాయంత్రం 6వేల క్యూసెక్కుల నీటిని జలవనరుల శాఖ అధికారులు విడుదల చేశారు. పాలేరు రిజర్వాయర్‌లో నీరు అడుగంటిన నేపథ్యాన తాగునీటి అవసరాలకు ఇక్కట్లు ఎదురుకాకుండా 1.5 టీఎంసీలు విడుదల చేయాలని జిల్లా జలవనరులశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో బుధవారం సాయంత్రం నీటిని విడుదల చేయగా శుక్రవారం ఉదయానికి పాలేరు రిజర్వాయర్‌కు చేరే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా రాముూనాయక్



రామూనాయక్

ఖమ్మం వైద్యవిభాగం: ఇన్‌చార్జ్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ బి.రామూనాయక్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీఎంహెచ్‌ఓ బి.మాలతి పదిహేను రోజుల సెలవులో వెళ్లగా ఆయనకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి విభాగాధిపతిగా కొనసాగుతున్న రామూనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

రెడ్‌క్రాస్ సేవల విస్తరణ



మాట్లాడుతున్న చెర్మన్ చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింతగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చైర్మన్ డాక్టర్ వెలిగెలి చంద్రమోహన్ తెలిపారు. ఖమ్మంలోని కార్యాలయంలో బుధవారం జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యాన వైద్యసేవలందించేందుకు మొబైల్ వ్యాన్ సమకూర్చాలని కలెక్టర్‌కు కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావుతో పాటు సూర్యప్రకాశరావు, గోవర్ధన్, సాదినేని జనార్ధన్‌రావు, సత్యనారాయణరెడ్డి, రాధాకృష్ణ, నరసయ్య, వీరభద్రం, జిల్లా వెంకటేశ్వర్లు, తాతా రాఘవయ్య, శ్రీహరి, వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, ఎం.డీ.గౌస్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇదే సమావేశంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శిగా గుడిమళ్ల సూర్యప్రకాశరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చైర్మన్, వైస్ చైర్మన్ తెలిపారు.

రామయ్యకు స్నపన తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామికి బుధవారం స్నపన తిరుమంజనం జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కాంగ్రెస్ సై!

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాష్ట్ర మంత్రి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన వరుస భేటీలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం హాజరు కానున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



- పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళిక
- ఖమ్మం స్థానంపై ప్రత్యేక దృష్టి
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భేటీలకు సన్నద్ధం
- మంత్రి, పార్లమెంట్ ఇన్‌చార్జి పొంగులేటి నేతృత్వంలో సమావేశాలు

సత్తా చాటేలా..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన కాంగ్రెస్.. హడావుడి ముగియగానే పార్లమెంట్ ఎన్నికలపై గురి పెట్టింది. ఈ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ద్వారా జాతీయస్థాయిలోనూ సత్తా చాటాలని యోచిస్తోంది. ఎన్నికలను ఎదుర్కొనేందుకు కేడర్‌ను సమాయత్తం చేసేలా సన్నాహక సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విస్తరించి ఉంది. ఈ నేపథ్యాన నేతలు, కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకొచ్చేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి.

కాంగ్రెస్‌కు అండగా..

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ గాలి వీచిన సమయంలోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని గెలుపు సాధించింది. ప్రతీ ఎన్నికల్లోనూ ఒకటి, రెండు సీట్లు మినహా.. కాంగ్రెస్, ఆ పార్టీతో జతకట్టిన పార్టీలే విజయం సాధిస్తూ వచ్చాయి. అదే తరహాలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్నప్పటికీ 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో చుక్కెదురైంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన రేణుకా చౌదరి.. బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి తీర్పు రాకుండా ఉండేలా కాంగ్రెస్ చర్యలు చేపట్టింది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ పార్టీ, కొత్తగూడెంలో పొత్తుతో సీపీఐ విజయం సాధించడంతో.. లోక్‌సభ స్థానంలోనూ గెలుపు ఇక నల్లేరు మీద నడకేనని ఆ పార్టీ భావిస్తోంది.

సన్నద్ధం

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహించనుంది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ సమావేశాలను రాష్ట్ర మంత్రి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన నిర్వహిస్తారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఆయనతో పాటు మంత్రులు దిశానిర్దేశం చేస్తారు. పార్టీ ఇచ్చిన హామీలు, అమలవుతున్న తీరు.. మిగతా హామీలు ఎప్పటి నుంచి అమలవుతాయనే అంశాలపై ప్రజలకు వివరించాల్సిన ఆవశ్యకతను కేడర్‌కు అవగాహన కల్పిస్తారు. అంతేకాక నియోజకవర్గాల వారీగా బలాబలాలపై సమీక్ష చేయనున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా ప్రత్యేకం..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాలు ప్రధాన పాత్ర పోషించాయి. ఈ క్రమంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయి. గతంలోనే బలీయమైన శక్తిగా ఉన్న కాంగ్రెస్ ఈ అసెంబ్లీ ఎన్నికలతో మరింత పట్టు సాధించినట్లయింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరగా పార్టీకి సంస్థాగతంగా ఉన్న పట్టుకు వారి బలం కూడా తోడు కావడంతో తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు మల్లు భట్టి విక్రమార్క ప్రభావం చూపించడంతో కాంగ్రెస్‌కు తిరుగులేకుండా పోయింది. ఇదే ఊపును పార్లమెంట్ ఎన్నికల్లోనూ కొనసాగించేలా చూడాల్సిన బాధ్యత ఇప్పుడు ముగ్గురు మంత్రులపై పడింది.

వినతులు పెండింగ్ ఉండొద్దు

- ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించండి
- ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: ప్రజలు విన్నవించే సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులు ఆదేశించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. నేలకొండపల్లి మండలం చెరువుమాధారానికి చెందిన రైతులు 110 ఎకరాల్లో వరి విత్తనాలు వేయగా 60 రోజుల్లోనే కంకులు వచ్చి నష్టపోయామని విన్నవించగా విచారణ చేపట్టి కంపెనీపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డీఏఓ విజయనిర్మలను ఆదేశించారు. అలాగే, రాజుపేట వద్ద నిర్మించిన చెక్‌డ్యాంను సాగర్ నీటితో నింపాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రేలా వెంకటరెడ్డి వినతిపత్రం అందజేశారు. అధికారులు విచారణ చేపట్టకుండా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీచేశారని నేలకొండపల్లి మండలం నాచేపల్లికి చెందిన మల్లెల వెంకటాచారి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టాలని సూచించారు. ఆతర్వాత మంత్రి మాట్లాడుతూ రాజుపేటలోని ఖబరస్తాన్‌కు ప్రహరీ నిర్మించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ భూముల కబ్జాపై సర్వే చేయాలని సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా తీర్థాల, కూసుమంచి ఆలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. తొలుత మంత్రి పొంగులేటి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులతో పాటు విద్యుత్ శాఖ నుండి మంజూరైన బీమా చెక్కులను అందజేశారు. అనంతరం కూసుమంచి మండలం ధర్మాతండాకు చెందిన విద్యార్థి జర్పుల సింధు రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోమాలోకి వెళ్లగా మంత్రి పరామర్శించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 గంటల వైద్యసేవలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు వైద్యం అందేలా తమ ప్రభుత్వం కృషిచేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలో హోమియో ఆస్పత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం లింగారంతండాలో జీపీ భవనం, పలుచోట్ల రహదారి నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ గణేష్, జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి శ్రీరాం, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామితో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వాణిశ్రీ, డాక్టర్ రాములు, ఉమామహేశ్వరరావు, బానోత్ శ్రీనివాస్‌నాయక్, మోహన్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు మాదాసు ఉపేందర్, జూకూరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, కూసుమంచిలో రహదారి పక్కన ఉన్న ఓ టీ స్టాల్ వద్ద కాన్వాయ్ నిలిపిన మంత్రి టీ తాగాక నిర్వాహకుడు అనిల్‌తో మాట్లాడి వ్యాపారంపై ఆరా తీశారు.



కూసుమంచి : క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం రూరల్ : తమ్మినేని కృష్ణయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

తమ్మినేని కృష్ణయ్యకు నివాళి

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం గతంలో హత్యకు గురైన నాయకుడు తమ్మినేని కృష్ణయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రాయల నాగేశ్వరరావు, తమ్మినేని నవీన్, తమ్మినేని మంగతాయారు పాల్గొన్నారు.

ఐదేళ్ల 'పాలన'కు తెర..

- నేడు ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- ప్రత్యేకాధికారుల చేతికి 'పంచాయతీ'లు

ఖమ్మంవన్‌టౌన్: గ్రామపంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం గురువారంతో ముగుస్తోంది. నూతనంగా ఏర్పడిన రాష్ట్రప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించేందుకు సుముఖంగా లేకపోవడంతో ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 589 గ్రామపంచాయతీలు ఉండగా.. ఇందులో ఐదు పంచాయతీలు ఇప్పటికే స్పెషల్ అధికారుల పాలనలో ఉన్నాయి. మిగతా 584 గ్రామపంచాయతీలకు సైతం జనాభా, ఆదాయం ఆధారంగా జిల్లా, మండల స్థాయి గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులను ప్రత్యేకాధికారులను నియమించారు.

ప్రత్యేకాధికారులకు పగ్గాలు

సర్పంచ్‌లు తమ పదవీకాలాన్ని పొడిగించాలని కొన్నాళ్లుగా కోరుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. చివరకు ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో అధికారుల ఆధ్వర్యాన పాలన సాగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో సర్పంచ్‌ల నుంచి రికార్డులు, డిజిటల్ కీలను అధికారులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు.

సర్పంచ్‌ల్లో ఆందోళన

పదవీకాలం ముగియనుండడంతో సర్పంచ్‌ల్లో ఆందోళన నెలకొంది. గతంలో ప్రభుత్వ సూచనల మేరకు పలువురు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మరికొందరు అప్పులు చేసి మరీ పనులు నిర్వహించారు. ఈ బిల్లుల కోసం ఎదురుచూస్తుండగానే పదవీకాలం ముగిసింది. దీంతో కొత్తప్రభుత్వం బిల్లులు ఇస్తుందా, లేదో స్పష్టత లేక అయోమయంలో పడిపోయారు.

అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు

కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హుల దరికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆయన సీఎం గిరివికాసం, ప్రధానమంత్రి ఆది ఆవాస్ గ్రామయోజన, ట్రైకార్ పథకాలు, ఆర్‌ఓఎఫ్‌ఆర్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఏఏజీవై పథకం మొదటి దశగా రూ.2 కోట్లతో మంజూరైన పనులు త్వరగా పూర్తిచేయడమే కాక రెండో దశ పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. కొణిజర్ల, సింగరేణి, రఘునాథపాలెం మండలాల్లో పోడు పట్టాలు పొందిన గిరిజనులు సాగు చేసుకునేలా బోర్లు వేసేందుకు అనుమతించాలని చెప్పారు.

ఎస్సెస్సీ ఫలితాలపై ప్రత్యేక దృష్టి

పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు సమాయత్తం చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. అలాగే, ప్రాథమిక విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కలెక్టరేట్‌లో పదో తరగతి విద్యార్థుల సన్నద్ధత తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీఈఓ సోమశేఖరశర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

నేడు జేఎల్‌ఎంల ఎంపిక పరీక్ష

ఖమ్మంవ్యవసాయం: జూనియర్ లైన్‌మెన్ల (జేఎల్‌ఎం) ఎంపిక పరీక్ష గురువారం ఖమ్మంలో నిర్వహించనున్నారు. విద్యుత్ శాఖ 2019 సంవత్సరంలో జూనియర్ లైన్‌మెన్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా దరఖాస్తు చేసుకున్న వారికి రాతపరీక్ష నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారికి దశల వారీగా పోస్టింగ్ ఇస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో అర్హులకు పోస్టింగ్ ఇచ్చి, మిగిలిన వారికి ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు మూడో విడతగా జూనియర్ లైన్లమెన్ల ఎంపికకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అర్హులైన 23 మందికి గురువారం ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ కార్యాలయంలో స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష పర్యవేక్షణ కోసం ఎన్పీడీసీఎల్ నుంచి సీఈ కిషన్ పరిశీలకులుగా, ఎస్‌ఈ ఏ.సురేందర్ చైర్మన్‌గానే కాక ఇద్దరు డీఈలతో కమిటీని నియమించారు. తొలుత అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తారు.



ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్తంభాలు

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

కూసుమంచి: మత్స్యకారులు శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్య శాఖ అధికారి ఆంజనేయస్వామి సూచించారు. పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో 'చేపల పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులు' అంశంపై మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణ బుధవారం ముగియగా ఆయన పాల్గొని సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. చేపల పెంపకానికి ఉన్న అపారమైన వనరులను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖమ్మం, సూర్యాపేట, వనపర్తి, మెదక్, నల్లగొండ, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల మత్స్యకారులు శిక్షణ పూర్తిచేసుకోగా శాస్త్రవేత్తలు డాక్టర్ శ్యాంప్రసాద్, శాంతన్న, రవీందర్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎఫ్‌ఓ, శాస్త్రవేత్తలు

రవాణాకు రాచమార్గం

- జిల్లా మీదుగా తరలిపోతున్న గంజాయి
- ఇన్నాళ్లు పొడిరూపంలోనే తీసుకెళ్లిన అక్రమార్కులు
- తాజాగా పట్టుబడిన 'చాక్లెట్లు'

ఖమ్మంక్రైం: ఒడిశా నుంచి తెలంగాణలోని జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలించే స్మగ్లర్లకు జిల్లా రాచబాటగా మారింది. ఎక్సైజ్, పోలీసు అధికారులు ఎంత కట్టడి చేసినా.. తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నా ఎక్కడో చోట గంజాయి పట్టుబడడం సర్వసాధారణమైపోయింది. అయితే, ఇన్నాళ్లు గంజాయిని బస్తాల్లో.. ఆ తర్వాత పోలీసుల నుంచి తప్పించుకోవడం కోసం వాహనాల్లో ఇతర సరుకుల కింద తరలించేవారు. అనంతరం నూనెగా మార్చి కూడా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇదంత ఎందుకు అనుకున్నారో ఏమో కానీ ఏకంగా గంజాయిని చాక్లెట్ల రూపంలోకి మార్చి తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. తాజాగా జిల్లా కేంద్రంలో చేపట్టిన తనిఖీల్లో ఈ గంజాయి చాక్లెట్లు పట్టుబడగా అవాక్కవడం ఎక్సైజ్ పోలీసుల వంతు అయింది.

ఒడిశా టు హైదరాబాద్

ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా గంజాయి సాగుకు పెట్టింది పేరు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పలువురు అక్కడకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి ప్యాకెట్లుగా తీసుకెళ్తుంటారు. తాజాగా అక్కడే గంజాయిని చాక్లెట్ల రూపంలోకి మార్చి ఎవరికీ అనుమానం రాకుండా మహిళల చేత రవాణా చేయిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు మహిళలు ఖమ్మంలో పట్టుబడగా... తనిఖీ చేసిన అధికారులే నివ్వెరపోయారు. ఒక్కో ప్యాకెట్‌లో ఐదు గ్రాముల చొప్పున 40చాక్లెట్లుగా ఉండగా ఆ ప్యాకెట్‌ను రూ.90కు కొనుగోలు చేసి రూ.400 చొప్పున విక్రయిస్తున్నట్లు గుర్తించారు. చార్మినార్ గోల్డ్, మున్నా తదితర పేర్లతో ఈ చాక్లెట్లు ఒడిశా ప్రాంతంలోనే తయారవుతున్నట్లు తెలిసింది.

చాక్లెట్లకు డిమాండ్..

గంజాయికి అలవాటు పడిన వారు పొడి కొనుగోలు చేయడం.. పీల్చడం చేస్తుంటారు. అయితే, ప్యాకెట్ల రవాణా సమయంలో తరచుగా పట్టుబడుతుండడంతో అమ్మకం, కొనుగోలుదారులు చాక్లెట్లపై దృష్టి సారించినట్లు సమాచారం. దీంతో ఒడిశాలోని స్మగ్లర్లు గంజాయి చాక్లెట్లు తయారుచేస్తున్నట్లు తెలిసింది. తద్వారా వీటి వాడకం సులువవుతుందని, తనిఖీల్లోనూ పట్టుబడే అవకాశాలు తక్కువగా ఉంటాయనే భావనకు వచ్చినట్లు చెబుతున్నారు. అంతేకాక కావాల్సినప్రాంతాలకు చేరవేసి అమ్మడం సులువవుతుందని గంజాయిని చాక్లెట్ల రూపంలో మారుస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో కొన్నాళ్ల క్రితం చాక్లెట్లు పట్టుబడగా మూడు రోజుల క్రితం వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద మూడు కేజీల గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకోవడం సంచలనం కలిగించింది.

పోలీసులకు చిక్కేది కొందరే...

గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కుతున్న వారు కొందరేనని.. అది కూడా కూలీలేనని సమాచారం. అసలు సూత్రధారులు ఎక్కడా పట్టుపడకుండా తెర వెనక ఉండి దందా నడిపిస్తుంటారని తెలిసింది. ఒడిశా నుంచి గంజాయితో జిల్లాకు చేరుకుంటున్న పలువురు సాధారణ ప్రయాణికుల మాదిరి బస్సుల్లో వెళ్తుండగా.. ఇంకొందరు రైళ్లను ఎంచుకుంటున్నారు. అయితే, తెలంగాణలో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టాక ఇదే అదునుగా రద్దీగా ఉంటున్న బస్సుల్లో గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసింది. అయితే, అసలు సూత్రధారులు దొరకనంత కాలం గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయడం సాధ్యం కాకపోవచ్చని పలువురు భావిస్తున్నారు.



గంజాయి చాక్లెట్ చూపిస్తున్న పోలీసు ఉద్యోగి



గంజాయి చాక్లెట్లు తీసుకెళ్తున్న పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

టెండ'రింగ్'

- కేఎంసీ పరిధిలో ఒకరిద్దరికే పనులు
- మంత్రుల మనుమలమంటూ కొందరు కాంట్రాక్టర్ల ఒత్తిడి
- ఏం చేయాలో తెలియని స్థితిలో మిగతా గుత్తేదారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నామినేటెడ్ పనులతో పాటు ఇతర అన్ని అభివృద్ధి పనులకు ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, కొందరు కాంట్రాక్టర్లు ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధుల అండ తమకు ఉందని చెబుతూ ఆ పనులను దక్కించుకోవడం సర్వసాధారణమైపోయింది. గత ప్రభుత్వంలోనూ ఇదే తరహాలో కొనసాగినట్లు ఆరోపణలు రాగా.. ఇప్పుడు కూడా పరిస్థితిలో మార్పు రాలేదనే చర్చ జరుగుతోంది. తాజాగా ఖమ్మంలో రైల్వే లైన్ విస్తరణలో భాగంగా నర్తకి థియేటర్ నుండి మొండి గేట్ వరకు మార్కింగ్ చేసిన ఇళ్లను తొలగించి రోడ్డు నిర్మించేందుకు రూ.2.70 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పనులకు అధికారులు టెండర్లు ఆహ్వానించగా.. కొందరు జోక్యం చేసుకుని 'మంత్రి గారు చెప్పారు, ఆ పనులు ఇద్దరికి మాత్రమే అప్పగించాలే తప్ప ఇంకొకరు టెండర్ వేయొద్దు..' అని కాంట్రాక్టర్ల నుండి అధికారుల వరకు ఎవరి స్థాయిలో వారు ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కేఎంసీలో పేరుకే టెండర్లు పిలుస్తున్నట్లు చెబుతున్నా... కొందరు కాంట్రాక్టర్ల పెత్తనం పెరిగిందని, బహిరంగంగానే రింగ్ అయి పనులు దక్కించుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వారికి కేటాయించేశాం..

నగర పాలక సంస్థలో గత కొన్నేళ్లుగా ఏ పనైనా ఒకరిద్దరు కాంట్రాక్టర్లే చేశారని, ఇతర కాంట్రాక్టర్లకు పనులు దక్కకుండా అడ్డుకున్నారనే విమర్శలున్నాయి. కానీ ప్రభుత్వం మారినప్పటికీ అదే విధానం కొనసాగడంపై మిగతా కాంట్రాక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా పిలిచిన టెండర్లలోనూ ఇద్దరు మినహా మిగతా వారు టెండర్ దాఖలు చేయకుండా సంఘం బాధ్యులుగా చెప్పుకునే వారు పర్యవేక్షించినట్లు తెలుస్తోంది. ఈమేరకు వారు ఏకంగా వాట్సప్ గ్రూప్‌లో రూ.2.70 కోట్ల అంచనాలతో చేపట్టే పనులను ఇద్దరు కాంట్రాక్టర్లకు కేటాయించినందున మిగతా వారు దూరంగా ఉండాలని మెసేజ్ పెట్టినట్లు సమాచారం.

ప్రభుత్వ పెద్దల పేర్లు చెబుతూ...

కేఎంసీలో పనులు దక్కించుకునేందుకు గాను కొందరు కాంట్రాక్టర్లు ప్రభుత్వంలోని పెద్దలు, మంత్రుల పేర్లు వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. 'మంత్రి చెప్పినందున ఇద్దరు కాంట్రాక్టర్లకే పనులు కేటాయించాలి, ఇంకెవ్వరు టెండర్ వేయకుండా చూడాలి' అని ఓ కాంట్రాక్టర్ ఇంజనీరింగ్ అధికారికి సైతం సూచనలు చేసినట్లు సమాచారం. అలాగే, మరికొందరు మంత్రి అనుచరులు, సహాయకుల పేర్లను సైతం వినియోగించుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

టెండర్ ఆన్‌లైన్‌లో పిలిచాం..

నర్తకి థియేటర్ నుండి మొండి గేట్ వరకు చేపట్టే పనులకు సంబంధించి ఆన్‌లైన్ టెండర్ పిలిచాం. ఒకరిద్దరికే పనులు అప్పగించాలని మాకు ఎవరూ సూచించలేదు. మేము కూడా ఫలానా వారే టెండర్ వేయాలని చెప్పలేదు. ఆన్‌లైన్‌లో ఎవరైనా టెండర్ వేసే అవకాశముంటుంది.

– కృష్ణాలాల్, ఈఈ, కేఎంసీ

క్లుప్తంగా

3న మెగా జాబ్ మేళా

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన ఈ నెల 3వ తేదీన ఖమ్మంలో మెగా జాబ్‌మేళా నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. జాబ్‌మేళాకు 7వ తరగతి మొదలు పీజీ, డిప్లొమా కోర్సులు ఉత్తీర్ణులైన వారు హాజరుకావొచ్చని తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన 65 కంపెనీల బాధ్యులు పాల్గొననుండగా, 5 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. పటేల్ స్టేడియంలో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు వివరాల కోసం 888677 11991, 96423 33668 నంబర్లలో సంప్రదించాలని, తమ పేర్లను https/forms.gle/aWHIuo5poRT3D6 లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఆర్వో వల్లోజు శ్రీనివాస్, మన్‌మోహన్ పాల్గొన్నారు.

రూ.1.82 కోట్లకు వ్యాపారి ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్: ఖమ్మంలోని గాంధీచౌక్ ప్రాంతానికి చెందిన వ్యాపారి కురివెళ్ల నాగేశ్వరరావు రూ.1,82,58,000కు గాను దివాళా పిటిషన్(ఐపీఈ) దాఖలు చేశాడు. ఆయన కిరాణం, స్వీట్స్, బేకరీ వ్యాపారం చేయగా, వ్యాపారాభివృద్ధి కోసం బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు చేశాడు. అయితే, వ్యాపారం సరిగా నడవక నష్టం రావడంతో అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ 45 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ఎడ్లపల్లి రమేష్ ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం దివాళా పిటిషన్ దాఖలు చేశాడు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కూసుమంచి: మండలంలోని కేశ్వాపురంలో బుధవారం ఓ మహిళ మెడలోని గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పారిపోయాడు. గ్రామానికి చెందిన వృద్ధురాలు తాళ్లూరి రంగమ్మ తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తోంది. ఇంతలోనే వెనుక నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. దీంతో ఆమె కేకలు వేస్తుండగా స్థానికులు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో చెరుకు కూలీ మృతి

నేలకొండపల్లి: పొట్టకూటి కోసం చెరుకు కూలీ పనులకు వచ్చిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఏపీలోని కాకినాడ జిల్లా సింగారానికి చెందిన సత్తిబాబు(50) తన బంధువులతో కలిసి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు నరికేందుకు వచ్చాడు. అమ్మగూడెంలోని ఓ రైతు ఇంటి వద్ద బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన ఆయన కుప్పకూలగా సహచర కూలీలు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే సత్తిబాబు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించగా.. అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

నేలకొండపల్లి: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్థానిక పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ముదిగొండ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు వద్ద పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ప్రేమ వ్యవహారంలో ప్రేమికుడి స్నేహితులపై దాడి

ఖమ్మంఅర్బన్: కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్న యువతీ, యువకుడు రెండు రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. దీంతో వివాహానికి ప్రోత్సహించారని అనుమానిస్తున్న ప్రేమికుడి స్నేహితులను యువతి తండ్రి నగర సమీపంలోని ఓ మామిడితోటకు పిలిపించి జంట ఎక్కడ ఉందో చెప్పాలంటూ చితకబాదినట్లు తెలిసింది. ఈ మేరకు ఒక యువకుడు తప్పించుకుని ఇంటికెళ్లగా.. తల్లి సుభద్ర సాయంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాక మరో ముగ్గురు యువకులను ఒక లాడ్జిలో బంధించగా, ఒక వ్యక్తి వచ్చి విడిపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదుతో రమేష్, ఉపేందర్, వెంకట్, మల్లేశ్‌తో పాటు మరో ఇద్దరిపై ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

నేలకొండపల్లి: నేలకొండపల్లి ఎక్సైజ్ అధికారులు బుధవారం చేపట్టిన తనిఖీల్లో ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి భద్రాచలం నుంచి వయా కోదాడ మీదుగా హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో నేలకొండపల్లి మండలం చెరువుమాధారం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన జయదేబ్ సర్కార్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 6.610 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో ఆయనను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ పోశెట్టి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

ఈజీఎస్‌కు ఇక్కట్లే !

ఉపాధి పథకంలో సిబ్బంది లేక ఇబ్బంది

- ఈనెల నుంచి పనుల సీజన్ ప్రారంభం
- ఏళ్లుగా భర్తీకి నోచుకోని ఖాళీలు
- ఉపాధి హామీ పనులపై తీవ్ర ప్రభావం



ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది, పక్కన పనుల్లో నిమగ్నమైన కూలీలు (ఫైల్)

చుంచుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పేదల వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం మొదట్లో ప్రతీ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించగా... కొత్త పంచాయతీల్లో ఎఫ్ఏలతో పాటు ఇతర సిబ్బంది లేక సీజన్‌లోనూ తగిన పనిదినాలు దొరకక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఇక సిబ్బంది కొరతతో కార్యదర్శులు, సీనియర్ మేట్లపై ని భారం పడుతోంది. ఫలితంగా పనులు చూపించడంలోనూ జాప్యం జరుగుతోంది. ఉపాధి పనుల కల్పన, పర్యవేక్షణ, కొలతల నిర్వహణ, ఆన్‌లైన్‌లో కూలీల వివరాల నమోదు, బిల్లుల చెల్లింపు వంటి అదనపు పనులతో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్‌లో ఉన్న అరకొరగా సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

17 విభాగాల్లో పనులు

ఉపాధి హామీ పథకంలో 17 విభాగాల్లో 250 పైగా పనులు చేపట్టే అవకాశం ఉంది. రోజువారీ పనులకు వచ్చే కూలీలకు చెల్లింపులు, సమన్వయం చేయడం, పరిపాలన బాధ్యతలను ఏపీఓలు, టీఏలు పనికి వచ్చే కూలీలతో కొలతల ప్రకారం పని చేయించి వివరాలు రికార్డు చేస్తారు. ప్రస్తుతం ఆయా పోస్టుల్లో సగం మంది మాత్రమే ఉండడంతో అదనపు భారం పడుతోంది. పాత పంచాయతీల లెక్క ప్రకారమే ఫీల్డ్ అసిస్టెంట్లు కొనసాగుతుండగా, కొత్త పంచాయతీల్లో ఎఫ్ఏలను నియమించాల్సి ఉంది. ఈనెల(ఫిబ్రవరి) రెండో వారం నుంచి జూన్ వరకు ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతాయి. గతేడాది వేసవి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 5 లక్షల మందికిపైగా కూలీలు ఉపాధి పనులను వినియోగించుకున్న నేపథ్యాన ఈసారైనా సిబ్బంది నియామకం ప్రభుత్వంపై దృష్టి సారిస్తే కూలీలకు మేలు జరుగుతుంది.

ఖాళీలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో భద్రాద్రి జిల్లాలో 481 పంచాయతీలకు 1.34 లక్షల మందికి జాబ్‌కార్డులు ఉండగా, వాటి పరిధిలో 2.30 లక్షల మంది పనులకు వస్తుంటారు. ఇక 22 మంది ఏపీఓలకు తొమ్మిది మంది మాత్రమే ఉన్నారు. ఈసీలు 22 మందికి ఎనిమిది మంది పనిచేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు 481 పంచాయతీలకు 232 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు సైతం 114 మందే ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 1.88 లక్షల జాబ్‌కార్డుల పరిధిలో 3.17లక్షల మంది కూలీలు ఉన్నారు. ఏపీఓలు 20 మంది, ఈసీలు 20 మందికి 15 మంది పనిచేస్తున్నారు. 589 పంచాయతీలకు 357 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే విధుల్లో ఉన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు సైతం 76 మందే ఉన్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలిలా..

	భద్రాద్రి జిల్లా	ఖమ్మం జిల్లా
గ్రామీణ మండలాలు	22	20
పాత పంచాయతీలు	205	427
కొత్త పంచాయతీలు	276	162
ప్రస్తుతం ఉన్న ఏపీఓలు	10	20
ప్రస్తుతం ఉన్న ఈసీలు	08	15
ప్రస్తుతం ఉన్న ఎఫ్ఏలు	232	357
ప్రస్తుతం ఉన్న టీఏలు	114	76
యాక్టివ్ జాబ్ కార్డులు	1.34లక్షలు	1.88 లక్షలు
యాక్టివ్ కూలీలు	2.30లక్షలు	3.17లక్షలు

ఐదు నుంచి ఆరు గ్రామాల బాధ్యతలు



చుంచుపల్లి మండలంలో 18 జీపీలకు గాను ముగ్గురమే టెక్నికల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నాం. ఒక్కొక్కరు 5, 6 గ్రామ పంచాయతీల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. దీంతో కూలీలకు సరైన సమయంలో పనులు కల్పించలేకపోతున్నాం. ప్రభుత్వం సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

– పిల్లి నాగరాజు, టీఏ

పని భారంతో సతమతం



కూలీలను పనులకు రప్పించడంతో పాటు పనుల పర్యవేక్షణ బాధ్యతలు మాపై ఉంటాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీలకు తగ్గట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. పాత జీపీల పరిధిలో పనిచేసిన వారినే కొత్త జీపీలకు సైతం వినియోగిస్తుంది. దీంతో అదనపు పనిభారంతో సతమతమవుతున్నాం.

– బానోతు కేస్లీ, ఫీల్డ్ అసిస్టెంట్

ఒకేరోజు రెండు సమావేశాలు

- 3న 'దిశ' కమిటీ సమావేశం
- నేడు జరగాల్సిన కేఎంసీ కౌన్సిల్ అదే రోజుకు వాయిదా
- గందరగోళంలో అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: అభివృద్ధి, పరిపాలనకు సంబంధించి నిర్వహించే కేఎంసీ కౌన్సిల్ సమావేశంతో పాటు కేంద్ర నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు, పథకాలపై చర్చించాల్సిన దిశ కమిటీ సమావేశాలు ఒకేరోజు జరగనున్నాయి. ఈ నెల 3న శనివారం ఎంపీ నామ నాగేశ్వరరావు అధ్యక్షతన ఖమ్మం కలెక్టరేట్‌లో దిశ కమిటీ సమావేశం జరగనుండగా.. అదేరోజు మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన కేఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ రెండు సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కావాల్సి ఉంది. దీంతో గందరగోళం నెలకొంది. దిశ కమిటీ సమావేశం ఈ నెల 3న ఏర్పాటు చేసినట్లు అధికారులతో పాటు, ప్రజా ప్రజానిధులకు సమాచారం ఇచ్చారు. ఇక కేఎంసీ కౌన్సిల్ సమావేశం గురువారం జరుగుతుందని తొలుత ఆహ్వానం పంపించి.. బుధవారం సాయంత్రం 3న నిర్వహించనున్నట్లు మళ్లీ సమాచారం చేరవేశారు. దీంతో ఒకేరోజు జరిగే సమావేశాలకు ఎలా హాజరు కావాలంటూ ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

19 అంశాలతో అజెండా..

కేఎంసీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 3న కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన జరగనుంది. ఇందులో 19 అంశాలతో కూడిన అజెండాపై చర్చించనున్నట్లు తెలిసింది. ప్రధానంగా గతంలో చేసిన పనుల బిల్లుల చెల్లింపు, ఉద్యోగుల వేతనాలు, మేయర్ రిఫ్రెష్‌మెంట్ ఖర్చుల బిల్లులు తదితరాలు ఉన్నట్లు సమాచారం.

ఎనిమిది నెలల తర్వాత 'దిశ'

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుతో పాటు కేంద్ర నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించే దిశ కమిటీ సమావేశం ఎనిమిది నెలల తర్వాత జరుగుతోంది. ప్రతీ మూడు నెలలకోసారి సమావేశం జరగాల్సి ఉన్నా పలు కారణాలతో వాయిదా వేస్తూ వచ్చారు. దీంతో పథకాల అమలుపై పర్యవేక్షణ కొరవడతుందని వాదనలు ఉన్నాయి. ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు చైర్మన్‌గా నిర్వహించే దిశ కమిటీ సమావేశం ఇదే చివరిది కాగా.. ఈ సమావేశంలోనైనా పథకాలపై పూర్తి స్థాయి చర్చ జరిపాలని ప్రజలు కోరుతున్నారు.

లారీల దొంగలు అరెస్ట్

- ఖమ్మంలో చోరీ.. ఏపీలో అమ్మకం
- ఒక లారీ, రూ.2 లక్షల నగదు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ హరికృష్ణ

ఖమ్మంక్రైం: లారీలను అపహరిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అమ్ముతున్న ఇద్దరిని ఖమ్మం త్రీటౌన్, సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ హరికృష్ణ వివరాలు వెల్లడించారు. ఖమ్మంలోని పంపింగ్‌వెల్ రోడ్ ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి చిరంజీవి, రామన్నపేటకు చెందిన కొత్త ఎలీషా విలాసవంతమైన జీవితాన్ని గడపటానికి దొంగతనాలను ఎంచుకున్నారు. గతేడాది నవంబర్‌లో శ్రీనివాసనగర్‌కు చెందిన మహ్మద్ జహుర్ లారీని అపహరించి అమ్మేశారు. గత నెల 19వ తేదీన నెహ్రూ బొమ్మ ప్రాంతంలో నిమ్మకాయల మార్కెట్ వద్ద పార్కింగ్ చేసి ఉన్న మరో లారీని సైతం అపహరించారు. దీంతో రంగంలోకి దిగిన సీసీఎస్, త్రీటౌన్ పోలీసులు తనిఖీ చేస్తుండగా కాల్వొడ్డు ప్రాంతం మీదుగా వెళ్తున్న లారీని తనిఖీ చేయగా వీరి వ్యవహారం బయటపడింది. ఈ మేరకు విచారణలో నవంబర్‌లో చోరీచేసిన లారీని అమ్మేయగా వారు స్క్రాప్‌గా మార్చారని తేలింది. దీంతో ఆ లారీ అమ్మగా వచ్చిన రూ.2 లక్షల నగదుతో పాటు గతనెల అపహరించిన లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. లారీల యజమానులు ఎక్కడ పడితే అక్కడ కాకుండా నిర్దేశిత అడ్డాల్లో మాత్రమే లారీలను పార్కింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో సీసీఎస్ ఏసీపీ రవి, సీఐలు బాలాజీ, దోమల రమేశ్, ఎస్ఐ వెంకన్న, సిబ్బంది శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



వైరా: రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. తెలంగాణ రిటైర్డు ఉద్యోగుల సంఘం సమావేశం బుధవారం వైరాలో నిర్వహించగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సహకారంతోనే తమ ప్రభుత్వం ఏర్పడిందని.. వారి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం బాధ్యులు పి.సత్యనారాయణ, సుబ్బయ్య, టీవీ కృష్ణయ్య, పైడిపల్లి శరత్‌బాబు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఎస్‌టీఓ యాలాద్రి, ఎస్‌బీఐ మేనేజర్ హన్మంతునాయక్‌తో పాటు బొర్రా రాజశేఖర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వైరా టౌన్ పూల వ్యాపారుల సంఘం బాధ్యులు ఎమ్మెల్యేను సన్మానించి తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విన్నవించారు. నాయకులు దార్న రాజశేఖర్, అన్సర్, జీవన్ పాల్గొన్నారు

ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తాం

కొణిజర్ల/ఏన్కూరు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో నిర్మించిన పల్లె దవాఖానా, పెద్దగోపతిలో జీపీ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపీపీ గోసు మధు, సర్పంచ్‌లు జిల్లా మహేశ్, తడికమళ్ల దానియేలు, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రమేశ్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డితో పాటు వడ్డే రమాదేవి, వడ్డే నారాయణరావు, తాతా సుధాకర్ కోసూరి శ్రీను పాల్గొన్నారు. కాగా, పెద్దగోపతిలో జీపీ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించేందుకు స్థానిక యువకులు వేదికపైకి రాగా అక్కడే ఉన్న పీసీసీ సభ్యుడు వడ్డే నారాయణరావు పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వారు సన్మానం చేయొద్దని అడ్డుకున్నారు. దీంతో యువకులు ఆయనతో వాగ్వాదానికి దిగగా... ఎస్ఐ శంకరరావు వారిని బయటకు తీసుకెళ్లడంతో గొడవ సద్దుమణిగింది. ఆతర్వాత పెద్దగోపతి జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్సెస్సీ విద్యార్థులకు ఎంపీటీసీ వడ్డే రమాదేవి, నారాయణరావు దంపతుల చేయూతతో ఏర్పాటుచేసిన అల్పాహారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కాగా, ఏన్కూరు మండలం లచ్చగూడెంలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సందర్శించి పూజలు చేశారు. ఆ తర్వాత తూతకలింగన్నపేటలోని గుడ్‌న్యూస్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, ఎంఈఓ దుగ్గిరాల జయరాజు, ఎస్ఐ బాదావత్ రవితో పాటు బ్రిటో, వేముల కృష్ణప్రసాద్, స్వర్ణ నరేందర్, మాలోతు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శి సస్పెండ్

పెనుబల్లి: పెనుబల్లి మండలంలోని కర్రాలపాడు గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ రాయపూడి మల్లయ్య, కార్యదర్శి బి.ఇందిరను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గౌతమ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామపంచాయతీకి వస్తున్న నిధులు, వసూలైన పన్నులను దుర్వినియోగం చేశారని ఉపసర్పంచ్ ఎ.కృష్ణయ్య ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ చేపట్టగా నోట్‌ఫైళ్లపై సంతకం తీసుకోకుండా, సరైన బిల్లులు, ఓచర్లు లేకుండా రూ.6,44,490 డ్రా చేసి తిరిగి రూ.1.40లక్షలు గ్రామపంచాయతీకి జమ చేశారని.. మిగిలిన రూ.5,04,490ను దుర్వినియోగం చేసినట్లు తేలింది. దీంతో సర్పంచ్, కార్యదర్శి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్య

దెబ్బతీసిన పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు



మంగ్యా (ఫైల్)

నేలకొండపల్లి: అర ఎకరం సొంత పొలానికి తోడు కౌలుకు తీసుకుని వివిధ రకాల పంటలు సాగు చేసిన ఆ రైతును ప్రకృతి పగబట్టింది. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక పెట్టుబడులకు తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం మోటాపురానికి చెందిన భూక్యా మంగ్యా(33) గ్రామంలో తనకు ఉన్న అర ఎకరం పొలానికి తోడు మరో 12 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగు చేశాడు. ఇటీవల మొక్కజొన్నను తెగుళ్లు తినేయగా, మిర్చి నారు రెండు సార్లు వేయాల్సి వచ్చింది. అలాగే, పత్తి సైతం సరిగ్గా దిగుబడి రాలేదు. పంటల సాగు చేసిన అందినకాడి కల్లా తెచ్చిన అప్పులు దాదాపు రూ.20 లక్షలకు చేరుకోగా వాటిని ఎలా తీర్చాలో తెలియక మంగ్యా నాలుగు రోజుల క్రితం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. పరిసరాల్లోని రైతులు గమనించి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాగా, మంగ్యా మృతదేహం వద్ద భార్య, చిన్నారులైన కుమారులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సొసైటీ డైరెక్టర్ బొల్లినేని వెంకటేశ్వర్లు, రావెళ్ల కృష్ణారావు తదితరులు కోరారు.

రాజీవ్‌గాంధీ స్మారక టోర్నీ విజేత వీఎం బంజర



వీఎం బంజర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రదీప్‌కుమార్, నిర్వాహకులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీలో వీఎం బంజర జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. ఈ మేరకు బుధవారం జరిగిన ఫైనల్స్‌లో వీఎం బంజర, ఖమ్మం అర్బన్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన బంజర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం అర్బన్ జట్టు 121 పరుగులు మాత్రమే చేయడంతో రెండో స్థానంలో నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు మహిళా క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొత్త సీతారాములు, టోర్నీ నిర్వాహకులు ఎండీ మతిన్, ప్రసాద్‌బాబు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జావీద్ అలీ, నరాల నరేశ్, వెంకట్, మమత, అంజలీ, నవీన, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం



డీసీఓ విజయకుమారికి నోటీస్ ఇస్తున్న డైరెక్టర్లు

కామేపల్లి: కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావుపై అవిశ్వాసం కోరుతూ 12 మంది సొసైటీ డైరెక్టర్లు నోటీస్ అందజేశారు. ఖమ్మంలో బుధవారం వారు జిల్లా సహకార శాఖ అధికారి విజయకుమారికి లేఖ అందజేసి మాట్లాడారు. కాగా, పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను 12 మంది చైర్మన్‌పై తిరుగుబావుటా ఎగురవేయడం గమనార్హం. కార్యక్రమంలో డైరెక్టర్లు పుచ్చకాయల వీరభద్రం, ములకలపల్లి కరుణ, దేవండ్ల యాదగిరి, సకినాల పద్మ, దొంగల వెంకటనరసమ్మ, తుమ్మలపల్లి వీరయ్య, హట్కర్ లక్ష్మి, పింగళి నాగభూషణం, భూక్యా జైత్రాం, భట్టు పెట్యా, గుజ్జర్లపూడి రాంబాబు పాల్గొన్నారు. కాగా, చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కాగా, అవిశ్వాసం ప్రకటించిన 12మందిలో ఐదుగురు సైతం బీఆర్ఎస్ పార్టీ నాయకులే కావడం గమనార్హం.

రౌడీషీటర్లలో మార్పు రాకపోతే పీడీ యాక్ట్

కౌన్సెలింగ్ ఇచ్చిన సీపీ సునీల్‌దత్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని, లేనిపక్షంలో పీడీ యాక్ట్ నమోదు చేయాల్సి వస్తుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా హద్దు మీరి వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు బుధవారం సాయంత్రం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ వారితో మాట్లాడి నేరచరిత్ర, ప్రస్తుతం ఏం చేస్తున్నారని తెలుసుకున్నారు. నేరప్రవృత్తి విడనాడడానికి అవకాశం ఇస్తున్నామని.. అయినా మారకపోతే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల కబ్జాకు పాల్పడే రౌడీషీటర్లు, రియల్టర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఇదిలా ఉండగా ఇటీవల టూటౌన్ పోలీస్‌స్టేషన్ రైటర్ కోటేశ్వరరావు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన అంశంపై సీపీ వివరాలు ఆరా తీసినట్లు తెలిసింది. స్టేషన్ ఉద్యోగుల పనితీరులో మార్పు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. సీపీ వెంట నగర ఏసీపీ హరికృష్ణ, సీఐ బాలకృష్ణ, ఎస్ఐ నాగరాజు ఉన్నారు

4న యూటీఎఫ్ జిల్లాస్థాయి సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

రఘునాథపాలెం: యూటీఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాలు ఈ నెల 4వ తేదీన నేలకొండపల్లిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథపాలెం మండలంలోని పలు పాఠశాలలను బుధవారం సందర్శించిన ఆయన సమావేశాల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా సమావేశాలకు ముఖ్య అతిథులుగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాష్ట్ర నాయకులు చావా రవి తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సత్రాం, ఎస్‌కే జానీమియాతో పాటు వి.ప్రసాద్, నర్మద, దాసు, హబీబాబేగం, రమాదేవి, విజయలక్ష్మి, అరుణ, నజీమా, పద్మావతి, చిన్నా, సవిత, కల్యాణి, సంధ్యారాణి, పుల్లయ్య, శర్మ పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య



మౌనిక (ఫైల్)

కామేపల్లి: ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న యువకుడు కొన్నాళ్లుగా వేధిస్తుండడంతో తట్టుకోలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని ఊట్కూర్‌కు చెందిన గుడిమెట్ల గోపీకృష్ణ, అదే గ్రామానికి చెందిన ఈసం మౌనిక (22) మూడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి మౌనికను భర్తతో పాటు అత్త, మామ, ఆడబిడ్డ అదనపు కట్నం కోసం వేధిస్తుండగా ఈనెల 12న కలుపుమందు తాగింది. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా మంగళవారం రాత్రి మృతి చెందింది. ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

- అన్ని జిల్లాల్లోని సచివాలయాల్లో మొదలైన కార్యక్రమం
- తొలి రోజే పదివేల డాక్యుమెంట్లు జారీ

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైంది. ‘నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు’ కార్యక్రమంలో పంపిణీ చేసిన 30.61 లక్షల ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు మొదలుపెట్టారు. తొలిరోజే పది వేల డాక్యుమెంట్లు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున వీఆర్‌ఓలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఆస్తిపై 10 సంవత్సరాల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయని దస్తావేజుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ఏ ప్రభుత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాల్సిన అవసరం ఉండదని స్పష్టంగా ముద్రించారు. స్థలానికి సంబంధించి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను వారి పేరు మీద చెల్లించుకోవచ్చని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తిపై భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలు, తగాదాలకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌లో ఆ స్థలానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విలువ, భూసేకరణ ద్వారా ఆ భూమిని సేకరిస్తే ఉన్న విలువను కూడా ముద్రిస్తున్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం పెద్దిపాలెంలో మొట్టమొదటగా తాతపూడి అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఆ స్థలం ప్రభుత్వ విలువ రూ.4.46 లక్షలు కాగా, భూసేకరణ విలువ రూ. 11.61 లక్షలుగా అందులో పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ల కోసం చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీ, యూజర్ ఛార్జిలను ప్రభుత్వమే భరిస్తోంది. అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన రూ. 11.61 లక్షల విలువైన ఆస్తికి సాధారణంగా అయితే ఆమె రూ. 18,600 స్టాంప్ డ్యూటీ, రూ. 2,325 రిజిస్ట్రేషన్ ఛార్జి, రూ. 500 యూజర్ ఛార్జి కలిపి మొత్తం రూ. 21,425 చెల్లించాల్సి ఉంటుంది. దానిని ప్రభుత్వమే భరించింది.

15 రోజుల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి..

పదిహేనురోజుల్లో 30.61 లక్షల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అందుకనుగుణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి రిజిస్ట్రేషన్లను మరింత వేగంగా చేయనున్నారు. రిజిస్ట్రేషన్లు చేసిన తర్వాత ఆ డాక్యుమెంట్లను (కన్వేయన్స్ డీడ్స్) లబ్ధిదారులకు అందించనున్నారు. రూ. 10 స్టాంప్ పేపర్లపై ఈ డీడ్ల ప్రింటింగ్‌ను రిజిస్ట్రేషన్లు అయినదాన్నిబట్టి జిల్లాల్లోనే చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి మూడో వారంలో ఈ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత నియోజకవర్గాలు, సచివాలయాల స్థాయిలో ప్రజాప్రతినిధులు ఈ డీడ్స్‌ను పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నారు.

6,100 పోస్టులతో డీఎస్సీ

సీఎం జగన్ నేతృత్వంలో కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం

టీచర్ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు.. ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల


మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 6,100 పోస్టులతో మెగా డీఎస్సీ – 2024 రానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూనే టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్యాశాఖతో పాటు గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణ స్థాయిలో బోధన కొనసాగేలా భారీగా ఉపాధ్యాయులను నియమించనుంది. మహిళా సాధికారతే లక్ష్యంగా ఫిబ్రవరి 16న నుంచి చివరి విడత ‘వైఎస్సార్ చేయూత’ పంపిణీ చేపట్టనున్నారు. సుమారు 27 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ప్రభుత్వం రూ.5,060.40 కోట్లు జమ చేయనుంది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మీడియాకు మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

2.20 లక్షల శాశ్వత ఉద్యోగాలు!

మెగా డీఎస్సీ 2024లో భాగంగా ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 185 సెంటర్లలో 15 రోజుల పాటు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తాం. అంతకంటే ముందు 8 రోజుల పాటు డీఎస్సీ అర్హత కోసం టెట్ పరీక్ష నిర్వహిస్తాం. డీఎస్సీ 2024 అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు 42 ఏళ్ల వయో పరిమితిని నిర్దేశించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు కల్పించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఒక్క విద్యా రంగంలోనే 14,219 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టింది. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ల విధానాన్ని తేవడంతో 7,761 పోస్టుల్లో కొత్త ఉపాధ్యాయులు చేరారు. డీఎస్సీతో పాటు అటవీ శాఖలో ఫారెస్టు రేంజర్లతో సహా వివిధ విభాగాల్లో 689 పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నాం. ఇలా వివిధ శాఖల్లో కలిపి ఇప్పటికే 2.13 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించాం. తాజా నోటిఫికేషన్ల ద్వారా మరో 7 వేల పోస్టులతో కలిపి 2.20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను అందించినట్లు అవుతుంది.

ఎస్‌ఈఆర్టీతో ఐబీ భాగస్వామ్యం..

పేదలకు, సంపన్నులకు తేడా నాణ్యమైన విద్య మాత్రమే. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ తీసుకొస్తున్నాం. ఐబీ విద్యా విధానంలో చదవడానికి ఏడాదికి రూ.7 లక్షల నుంచి రూ.36 లక్షల దాకా ఖర్చవుతుంది. సంపన్నుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండే డిజిటల్ సదుపాయాలు, ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లను పేద పిల్లలకు కూడా అందుబాటులోకి తేవడంతో మార్పు మొదలైంది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్తా బోధనలో ఐబీని భాగస్వామ్యం చేస్తున్నాం. ప్రభుత్వంతో ఒప్పందానికి ఐబీ సంస్థ ముందుకు వచ్చింది. 2025–26 విద్యా సంవత్సరం జూన్ నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ మొదలవుతుంది. 2026–27 విద్యా సంవత్సరం నాటికి రెండో తరగతికి విస్తరిస్తాం. 2035 నాటికి పదో తరగతి, 2037 నాటికి ప్లస్ 2 తరగతి విద్యార్థులు ఐబీ బోర్డు జాయింట్ సర్టిఫికేషన్‌తో పరీక్షలు రాస్తారు.

మరికొన్ని అంశాలకూ ఆమోదం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగింపు.
- ప్రతి గ్రామ పంచాయితీకి పంచాయతీ కార్యదర్శి ఉండాలన్న నిర్ణయానికి ఆమోదం.
- ఏపీ డిస్కమ్‌లకు రూ.1,500 కోట్ల రుణాలపై ప్రభుత్వ గ్యారంటీ.
- అత్యంత మారుమూల ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీజీటీ) ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.89.98 కోట్లతో రూపొందించిన డీపీఆర్‌కు ఆమోదం.

ఇంధన రంగంలో భారీగా పెట్టుబడులు

రాష్ట్రంలో విండ్, సోలార్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. ఇందులో భాగంగా గ్రీన్‌కో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 1,500 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు నంద్యాల జిల్లా గడివేముల మండలం చిన్నక్కపల్లెలో 1,272.07 ఎకరాలు, మిద్తూరు మండలం మాసాపేట, నాగలూటి గ్రామాల్లో 1,011.44 ఎకరాలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో అవసరమైన భూములను గుర్తించనుంది. సోలార్, విండ్‌తో సహా పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులకు ఇండోసోల్ సోలార్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అవసరమైన భూములు కేటాయించేందుకు ఎస్‌పీవీ ఏర్పాటు ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

మరికొన్ని స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు

- మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు నియామకం
- ఐదో జాబితా ప్రకటించిన విద్యాశాఖ మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఇప్పటిదాకా 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల ఎంపిక పూర్తి



సాక్షి, అమరావతి: ఏపీలో మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద బుధవారం సాయంత్రం వెల్లడించారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయానికి పట్టం కడుతూ.. సామాజిక న్యాయం చేస్తూ... యువతకు పెద్దపీట వేస్తూ ఐదో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు ఆ స్థానంలో బీసీ వర్గానికి చెందిన మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపిక చేశారు. కాకినాడ లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా చలమలశెట్టి సునీల్, మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, తిరుపతి లోక్‌సభ స్థానానికి ప్రస్తుత ఎంపీ మద్దిల గురుమూర్తిని నియమించారు. అరకు వ్యాలీ(ఎస్టీ) శాసనసభ స్థానం సమన్వయకర్తగా రేగం మత్స్యలింగం, సత్యవేడు(ఎస్సీ)కు నూకతోటి రాజేష్, అవనిగడ్డకు ప్రముఖ వైద్యుడు సింహాద్రి చంద్రశేఖరరావును నియమించారు. ఈ జాబితాతో కలిపి ఇప్పటివరకూ 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు కొత్తగా సమన్వయకర్తలను నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయర్తల్లో 21మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 17 మంది బీసీలు, నలుగురు మైనార్టీలు, 14మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 13 లోక్‌సభ స్థానాల్లో బీసీలు ఏడుగురు, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు ముగ్గురు ఉన్నారు.

3 నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు



తిరుమల: శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావవ్యాప్తి కోసమే తిరుమల ఆస్థానమండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ధార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ధార్మిక సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మరింతగా హైందవ ధర్మాన్ని, శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేసేందుకు, చిన్నవయసు నుంచే చిన్నారుల్లో మానవతా విలువలను పెంచేందుకు టీటీడీ అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దీన్లో భాగంగా ధార్మిక సదస్సు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు స్వీకరించి మరింతగా ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 57 మంది పీఠాధిపతులు సదస్సుకు వచ్చేందుకు సమ్మతించినట్లు చెప్పారు. శ్రీవారి ఆలయం నుంచి ఏ సందేశం వెళ్లినా భక్తులందరూ ఆమోదించి ఆచరిస్తారని ఛైర్మన్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి రావెల

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు దంపతులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో కిషోర్ బాబు, ఆయన సతీమణి శాంతి జ్యోతి వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ఆయన సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ బడుగు బలహీన వర్గాల వారి తరఫున నిలిచారని, సమాజంలో అసమానతలు రూపుమాపుతున్నారని అన్నారు. అందువల్లే వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు.

నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని సీఎం జగన్‌ను అడగలేదు. పార్టీ కోసం ఏలా సేవలందించమంటే అలా చేస్తానని చెప్పా. ఎలాంటి కండిషన్ లేకుండా పార్టీలో చేరాను. సీఎం జగన్ ఏ బాధ్యత ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తా. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సీఎం జగన్‌తో కలిసి ప్రయాణం చేస్తా అని చెప్పారు.

జిల్లా వార్తలు

ఐఎన్‌టీయూసీ కొత్త కమిటీలు రద్దు

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీలో పదేళ్లుగా పనిచేస్తున్న వారిని కాదని కొత్త వారితో ఇటీవల ప్రకటించిన నాలుగు ఏరియాల కమిటీలను అధినాయకత్వం రద్దు చేసిందని యూనియన్ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్ తెలిపారు. కొత్తగూడెంలో బుధవారం వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆరు ఏరియాల్లో గెలిపించిన కార్మికులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కాగా, యూనియన్‌లో ఏళ్లుగా పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా సభ్యత్వం లేని వారికి పదవులు కట్టబెట్టడంతో కార్మికులు నిరసన తెలిపారని పేర్కొన్నారు. దీంతో ఆయా కమిటీలను రద్దు చేస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ వెల్లడించారని, త్వరలోనే కొత్త కమిటీలను ప్రకటిస్తారని తెలిపారు.

శాశ్వత నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం విరాళం అందించారు. మియాపూర్‌కు చెందిన మల్లాది వెంకటసుబ్రహ్మణ్యం, విజయకృష్ణ రూ.లక్ష నగదును ఆలయ అధికారులకు అందించగా వారు దాతలకు రశీదు ఇచ్చి స్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు సాయిబాబా, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి మెరుగైతే రయ్ రయ్

- గుండాల మీదుగా మేడారం వెళ్తున్న భక్తజనం
- రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు
- జాతరలోగానైనా పూర్తిచేయాలని వినతులు


లింగాల–పస్రా మధ్య రహదారిపై గుంతలు (ఇన్‌సెట్) ట్రాక్టర్‌లో మేడారం వెళ్తున్న భక్తులు


ఇటీవల కొంత మేర వేసిన బీటీ రోడ్డు

గుండాల: గిరిజన కుంభమేళాగా పేరున్న ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క – సారలమ్మ జాతరకు భక్తులు కొద్దిరోజులుగా వెళ్తున్నారు. జాతర జరిగే సమయాన రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే భక్తులు తల్లులకు మొక్కులు అప్పగించేందుకు వెళ్లివస్తున్నారు. ప్రధానంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వారు ఎక్కువగా గుండాల మీదుగా పస్రా – నార్లాపురం నుంచి మేడారం చేరుకుంటారు. భక్తులు ఎక్కువగా ప్రైవేట్ వాహనాల్లో వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డు సరిగ్గా లేకపోవడంతో అవస్థ పడుతున్నారు. జాతర సమీపిస్తున్న నేపథ్యాన అధికారులు స్పందించి రోడ్డు వేయిస్తే ఈ మార్గంలో వెళ్లివచ్చే భక్తుల ఇక్కట్లు తీరనున్నాయి.

ఎంత దూరం..

గుండాల నుంచి 61 కి.మీ.ల దూరంలో మేడారం ఉంటుంది. ఆళ్లపల్లి మండలం నుంచైతే 80 కి.మీ.లు, ఇల్లెందు నుంచి గుండాల – పస్రా మీదుగా 121 కి.మీ.లు, కొత్తగూడెం నుంచి వయా ఇల్లెందు – గుండాల మీదుగా 140 కి.మీ.ల దూరం ప్రయాణించాలి. ఇక ఖమ్మం నుంచి వయా ఇల్లెందు, గుండాల వరకు 102 కి.మీ.లు, అక్కడి నుంచి మేడారం 61 కి.మీ.ల దూరంలో ఉంటుంది.

అర్ధంతరంగా నిలిచిన రోడ్డు పనులు

గుండాల నుంచి పస్రా 38 కి.మీ.ల దూరంలో ఉండగా.. మధ్యలో 10 కి.మీ.లు మినహా నూతనంగా బీటీ రోడ్డు నిర్మించారు. దీంతో ప్రయాణం కొంత సాఫీగానే సాగుతోంది. మరికొంత దూరం మెటల్ వేసి వదిలేయగా.. ఇంకో మరో ఐదు కి.మీ.ల మేర అసలు పనులే ప్రారంభించలేదు. ఫలితంగా ఇక్కడ వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పూర్తిగా అడవి మార్గం కావడం.. రోడ్డు బాగా లేకపోవడంతో వాహనం ఎక్కడ ఆగిపోతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ఐదు కి.మీ.ల మేర పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. కొద్దిరోజుల నుంచి హన్మకొండ డిపో నుంచి గుండాల మీదుగా మేడారానికి బస్సు సర్వీస్ ప్రారంభించారు. అలాగే, ఇల్లెందులో డిపో అధికారులు సైతం గుండాల మీదుగా ఓ బస్సును వారానికి రెండు రోజుల పాటు నడిపిస్తామని ప్రకటించినా మధ్యలో ఆపేశారు. దీనికి ప్రధాన కారణం రహదారి బాగా లేకపోవడమేనని తెలుస్తోంది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారిని మరమ్మతు చేయించాలని భక్తజనం కోరుతోంది. అంతేకాకుండా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, ఇల్లెందు డిపోల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుండాలలో బస

దూర ప్రాంతాల నుంచి మేడారం వెళ్తున్న భక్తులు గుండాల సమీపంలో బస చేస్తున్నారు. మార్గమధ్యలోని జామరగూడెం వద్ద సమ్మక్క – పగిడిద్దరాజును దర్శించుకుని వెళ్తున్నారు. ఇల్లెందు, ఖమ్మం, కొత్తగూడెం, టేకులపల్లి, కొత్తగూడెం తదితర మండలాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతున్నందున మిగిలిపోయిన 5 కి.మీ.ల రోడ్డును జాతరలోపు అయినా మరమ్మతు చేయించాలని వారు కోరుతున్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



మేడారం జాతరకు గుండాల మీదుగా భక్తులు అధిక సంఖ్యలో వెళ్తున్నారు. లింగాల నుంచి పస్రా వరకు రోడ్డు పనులు ప్రారంభించిన అధికారులు మధ్యలో వదిలివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. త్వరలో జాతర ప్రారంభం కానున్నందున అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

–పూనెం మంగయ్య, దేవళ్లగూడెం

ఆలయాల భూముల్లో అక్రమాలపై కఠినచర్యలు

ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సులోచన


ఆలయ భూమిలో తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాలయాల భూముల ఆక్రమణలు, అక్రమాలను సహించేది లేదని ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.సులోచన హెచ్చరించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని పలు ఆలయాలకు సంబంధించి భూముల విషయంలో అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ఈ సందర్భంగా కూసుమంచి మండలం జీళ్లచెరువు శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం భూములను బుధవారం ఆమె పరిశీలించారు. సదరు భూముల్లో తవ్వకాలు జరిగినట్లు గుర్తించగా.. పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆలయ భూముల్లో తవ్వకాలు జరగకుండా, ఎవరూ ఆక్రమణలకు పాల్పడకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంట ఖమ్మం దేవాదాయ శాఖ పరిశీలకురాలు ఆర్.సమత తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే విజయం

మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు


మాట్లాడుతున్న రామచంద్రరావు

చుంచుపల్లి: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో బీజేపీకే గెలుపు అవకాశాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు అన్నారు. కొత్తగూడెంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ అధ్యక్షతన బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో రామచంద్రరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేసే పరిస్థితి లేకపోవడంతో ఆ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోతోందన్నారు. ప్రజలను మోసం చేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటేనని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడంతో ఆ పార్టీ తీరు అర్థమవుతోందన్నారు. కాగా, అయోధ్యకు వెళ్లే రామ భక్తుల సౌకర్యార్థం ఈ నెల 5 నుంచి మార్చి 5 వరకు ఆస్థా పేరుతో రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు నడిపిస్తుందని తెలిపారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10 నుంచి విజయ సంకల్ప యాత్ర పేరుతో బస్సుయాత్రలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, చింతలచెరువు శ్రీనివాసరావు, తాటిపాముల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరు నెలల్లో కాపు


ఆయిల్‌పామ్ మొక్కను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ప్రసాద్, అధికారులు

సత్తుపల్లి: ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరు నెలల్లోనే గెలలు వస్తాయని ఐఓపీఆర్ శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. సత్తుపల్లి మండలం నారాయణపురంలో కాపుకు రాని ఆయిల్‌పామ్ తోటను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు పుచ్చకాయల సోమిరెడ్డి 12ఎకరాల్లో నాటిన తోటలో కొన్ని చెట్లు చనిపోవడం, మరికొన్ని కాపుకు రాకపోవటంతో ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేయగా పరిశీలించారు. మంచిగా ఉన్న చెట్టు కూడా కింద పాడైతే దెబ్బతినే అవకాశం ఉన్నందున డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పలు దశల్లో బోరాన్, పొటాష్, మెగ్నీషియం అందించాలని సూచించారు. ఉద్యానవన శాఖాధికారి డీ.వీ.రమణ, ఆయిల్‌ఫెడ్ డీఓలు భారతి, బాలకృష్ణ, ఎస్‌ఓ రాజశేఖర్‌రెడ్డి, రైతులు పుచ్చకాయల సోమిరెడ్డి, తుంబూరు కృష్ణారెడ్డి, ఒగ్గు అప్పిరెడ్డి, వేంపాటి లక్ష్మీనారాయణ, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సోషలిస్ట్ రాజ్యస్థాపన కోసమే ‘మాస్‌లైన్’

- మూడు విప్లవ పార్టీలు విలీనం కానున్నాయి..
- వచ్చేనెల 3, 4, 5వ తేదీల్లో ఐక్యతా జాతీయ మహాసభలు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు


మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో సమసమాజం, నూతన ప్రజాస్వామిక, సోషలిస్ట్ రాజ్యం రావాలనే ఆశయంతో పనిచేస్తున్న పార్టీ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, పీసీసీ సీపీఐ ఎంఎల్ ఐక్యతా జాతీయ మహాసభలు మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్న సందర్భంగా ఆహ్వాన సంఘం ఏర్పాటు సభ ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, పోటు రంగారావు మాట్లాడుతూ.. మతోన్మాదం, ఫాసిజం, నిరంకుశత్వం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీ ప్రజాపంథా అని తెలిపారు. లౌకిక, ప్రజాస్వామిక పౌరహక్కుల కోసం గొంతు విప్పుతూ ఎన్నో పోరాటాలు నిర్వహించామని చెప్పారు. ఈ క్రమం కొనసాగింపులో భాగంగా మూడు విప్లవ పార్టీలు విలీనం కానున్నాయని, 14 రాష్ట్రాల్లో పనిచేసే పార్టీలు ఒక అవగాహనకు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా మార్చిలో నిర్వహించే ఐక్యతా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మూడు విప్లవ పార్టీలు విలీనం కానుండడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. భవిష్యత్‌లో మరిన్ని పార్టీలు ఐక్యత వైపు అడుగులు వేయాలని సూచించారు.

ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి

ఖమ్మం వేదికగా మూడు రోజుల పాటు జరిగే మూడు విప్లవ పార్టీల ఐక్యతా జాతీయ మహాసభలకు ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడిగా న్యాయవాది వద్దేల్లి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు, కోశాధికారిగా గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాయల చంద్రశేఖర్, డాక్టర్ కె.జగదీశ్‌బాబు, పుసులూరి నరేందర్, వై.కృష్ణయ్య, పి.రవిమారుత్, కాకి భాస్కర్, రాయల రవి కుమార్, చావా రమేశ్‌బాబు, చావా శ్రీహరి, నయీమ్, సత్యనారాయణ, ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అలాగే, నగర ప్రముఖులు, మేధావులు, విద్యావేత్తలు, వైద్యులు, ప్రజాసంఘాల బాధ్యులు సభ్యులుగా వ్యవహరించనున్నారు.